Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

సోమవారం
2 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 116
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

# అప్రమత్తంగా ఉండాలి



- భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలి
- భారీ వర్షాల వేళ ఇరిగేషన్ శాఖ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు కుంటల్లో నీటిని నిల్వ చేయాలని
- కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించాలి
- నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాలను భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. వరదలు ముంచెత్తున్నాయి. దాదాపు చెరువులన్నీ నిండిపోగా.. నదులు, వాగులు, వంకలు వరదలతో ఉప్పొంగుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలంటూ ఇరిగేషన్ అధికారులను సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు కుంటల్లో నీటిని నిల్వ చేయాలని సూచన చేశారు. ఎగువన కురిసిన వర్షాలతో పాటు కడెం నుంచి వస్తున్న వరదతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండింది. దీంతో ఎల్లంపల్లి గేట్లు - మిగతా3లో



# మరో డీఎస్సీకి సన్నాహాలు

- 11,062 పోస్టుల భర్తీకి ఇటీవల డీఎస్సీ పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం
- డిసెంబర్/జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి జూన్-జులైలోపు నియామకాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.
- ఆలోపు టెట్ కూడా నిర్వహించే అవకాశం ఉంది
- ప్రస్తుత డీఎస్సీతో ఎంతమంది ఉపాధ్యాయులు భర్తీ అవుతారు? ఇంకా ఎన్ని ఖాళీలుంటాయనే సమాచారాన్ని జిల్లాల వారీగా సేకరిస్తోంది.

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో 11,062 పోస్టుల భర్తీకి ఇటీవల డీఎస్సీ పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం మరో డీఎస్సీకి కసరత్తు చేస్తోంది. డిసెంబర్/జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి జూన్-జులైలోపు నియామకాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆలోపు టెట్ కూడా నిర్వహించే అవకాశం ఉంది. ప్రస్తుత డీఎస్సీతో ఎంత మంది ఉపాధ్యాయులు భర్తీ అవుతారు? ఇంకా ఎన్ని ఖాళీలుంటాయనే - మిగతా3లో

## 11 జిల్లాల్లో రెడ్ అలెర్ట్..
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- భారీ వర్షాల వల్ల ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- తెగిపోయేందుకు అవకాశం ఉన్న చెరువులు, కుంటలకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలి
- ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఆర్ అండ్ బీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాల వల్ల ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ యంత్రాంగాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అప్రమత్తం చేశారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో11 జిల్లాలల్లో రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తెగిపోయేందుకు అవకాశం ఉన్న చెరువులు, కుంటలకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిరంతరం అధికారులతో టెలిఫోన్‌లో మాట్లాడుతూ చేపట్టాల్సిన సహాయక చర్యలపై సూచనలు చేస్తున్నారు. ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా - మిగతా3లో

## రేవంత్ రెడ్డి గారి కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా?

హైదరాబాదులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం

రేవంత్ రెడ్డి నిర్ణయం సాహసోపేతమన్న నాగబాబు

ఆయన చర్యలను అందరూ అభినందించాలంటూ ట్వీట్

# స్టే సేఫ్ తెలంగాణ



- వరదల పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- తప్పనిసరైతే తప్ప బయటకు వెళ్లొద్దు: కేటీఆర్
- చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి
- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**శుభ తెలంగాణ హైదరాబాద్**

స్టే సేఫ్ తెలంగాణ.. భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు, పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తప్పనిసరి అయితే తప్ప, దయచేసి బయటికి వెళ్లొద్దని సూచించారు. చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. తాత్కాలిక నిర్మాణాలు, పాడుబడ్డ భవనాలకు దూరంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని, సహాయ చర్యల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేయాలని ఎక్స్ వేదికగా సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో - మిగతా3లో



## తెలంగాణ-ఏపీ మధ్య నిలిచిన రాకపోకలు..

- అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిలిచిన వాహనాలు
- చిమిర్యాల వాగు ఉద్ధృతి...
- ఏపీ-తెలంగాణ సరిహద్దులో నిలిచిన వాహనాల రాకపోకలు
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు
- చిమిర్యాల, పాలేరు వాగుల ఉగ్రరూపం

# అధికారుల్లో హైడ్రా చిచ్చు



- మా ఉద్యోగులపై కేసులెట్లా పెడ్తరు?
- కబ్జా చేసినోళ్లను వదిలి మావాళ్లపై కేసులా
- హైడ్రాపై రాష్ట్రస్థాయి అధికారి తీవ్ర ధ్వజం


**శుభ తెలంగాణ హైదరాబాద్**

రాష్ట్ర అధికారుల్లో ఇప్పుడు హైడ్రా చిచ్చు మొదలైంది. రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా' పేరుతో ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయించటం, చెరువులు, నాలాలను కబ్జా చెర నుంచి విడిపించే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, కొందరినే లక్ష్యంగా చేసుకొని హైడ్రా పనిచేస్తున్నదన్న ఆరోపణలు వస్తుండగా, ఆరుగురు మున్సిపల్, రెవెన్యూ అధికారులపై కేసు పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమ శాఖల అధికారులపై కేసు పెట్టడం ఉన్నతాధికారుల్లో ఒకింత అసహనం వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో ఈ తరహా కేసు పెట్టడం ఇదే తొలిసారి కాగా, ఎప్పుడో ఇచ్చిన అనుమతులపై ఇప్పుడు కేసులు నమోదు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక నిర్మాణాల్లో అనేక ఉల్లంఘనలు ఉన్నాయని, - మిగతా3లో

## డీఎస్పీల ప్రమోషన్లకు రంగం సిద్ధం

### 78మంది పదోన్నతికి ప్రపోజల్

**శుభ తెలంగాణ హైదరాబాద్**



పోలీసుశాఖలో మరోసారి పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఈసారి 78 మంది డీఎస్పీ స్థాయి(సివిల్) అధికారులకు అడిషనల్ ఎస్పీ(నాన్‌కేడర్)లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 78 మంది అర్హులైన డీఎస్పీల లిస్టును ఏసీబీ క్లియరెన్స్ కోసం డీజీ సీవీ ఆనంద్‌కు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) పంపినట్లు తెలిసింది. అర్హులైన డీఎస్పీలకు పదోన్నతులు కల్పించాలని అన్ని కమిషనరేట్లు, ఎస్పీ ఆఫీసులకు డీజీపీ కార్యాలయం లేఖ పంపింది. ఇదే విషయాన్ని మల్టీజోన్ ఐజీలకు, ట్రైనింగ్ డైరెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా తెలియజేసింది. లిస్టులో జతచేసిన అధికారుల ట్రాక్ రికార్డులు, క్రిమినల్ చర్యలను దృష్టిలో పెట్టుకొని పదోన్నతులపై తుది జాబితాను డీజీపీ కార్యాయాలనికి ఏసీబీ అధికారులు అందజేయనున్నారు.

# టీఎంసీకి ఎదురుదెబ్బ.. అసోం పార్టీ అధ్యక్షుడు రాజీనామా



తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అసోంలో ఎదురుదెబ్బ తగిలింది. అసోం టీఎంసీ పార్టీ అధ్యక్షుడు రిపున్ బోరా ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. అసోం ప్రజలు టీఎంసీని పశ్చిమ బెంగాల్‌లోని 'ప్రాంతీయ పార్టీ'గా పరిగణిస్తున్నారని, కానీ అసోంలో తమ పార్టీగా అంగీకరించడానికి ఇష్టపడటం లేదని ఆయన అన్నారు. అంతేకాదు అసోంలో టీఎంసీకి ఆమోద యోగ్యంగా ఉండాలని పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి పలు సూచనలు చేశామని గుర్తు చేశారు. అయినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి రాసిన లేఖలో రిపున్ బోరా స్పష్టం చేశారు.

**పట్టించుకోలేదు**

జాతీయ స్థాయిలో అస్సామీ నేతను చేర్చుకోవాలని, కోల్‌కతాలోని టోలీగంజ్‌లోని భారతరత్న డాక్టర్ భూపేన్ హజారికా నివాసాన్ని వారసత్వ ప్రదేశంగా ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. కూచ్ బెహార్‌లోని మధుపూర్ సత్రాన్ని సాంస్కృతిక కేంద్రంగా మార్చాలని కూడా సూచించినట్లు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు గత ఏడాదిన్నర కాలంగా అభిషేక్ బెనర్జీ, మమతా బెనర్జీలను కలవాలని ప్రయత్నించినా సఫలం కాలేదని రిపున్ బోరా తెలిపారు. రెండేళ్లకు పైగా టీఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఈ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని పునరావృత సమస్యలు మా పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు.

**అనేక సార్లు సూచనలు**

మాజీ రాజ్యసభ సభ్యుడు, అసోంలో టీఎంసీకి ఆమోదయోగ్యంగా ఉండాలని పార్టీ అధిష్టానానికి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అనేక సూచనలు ఇచ్చామన్నారు. కానీ అవి కూడా అమలు కాలేదని చెప్పారు. తాను రెండేళ్లకు పైగా అసోం టీఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశానని, ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో విస్తృతంగా సంభాషించానని చెప్పారు. దురదృష్టవశాత్తూ అనేక అంశాల పెండింగ్ నేపథ్యంలో అసోంలోని చాలా మంది ప్రజలు %టీజ%ని పశ్చిమ బెంగాల్ ప్రాంతీయ పార్టీగా చూడడానికి దారితీశాయన్నారు. ఈ క్రమంలో అసోం ప్రజలు వేరే రాష్ట్రానికి చెందిన పార్టీని అంగీకరించడానికి ఇష్టపడటం లేదన్నారు. అనేక సవాళ్లకు తగిన పరిష్కారం లేకపోవడంతో తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకోవలసి వచ్చిందన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో మరో దారుణం




**కోల్‌కతా :** కోల్‌కతాలోని ఆర్ జి కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దాంతో స్థానిక కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు అన్ని కోర్టులు ఈ అంశంలో జోక్యం చేసుకున్నాయి. అలాంటి వేళ.. కోల్‌కతాలోని ఓ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ నర్సు పట్ల చికిత్స తీసుకుంటున్న వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో ఆసుపత్రి వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని బీర్భం జిల్లాలోని ఇలంబజార్ ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. తీవ్ర జర్వంతో బాధపడుతున్న వ్యక్తిని అతడి కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఇలాంబజార్ ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చారు. అతడికి అత్యవసర చికిత్స అందించే క్రమంలో.. సలైన్ పెట్టేందుకు నర్సు యత్నించింది. ఆమె పట్ల అతడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతే కాకుండా ఆమెను తీవ్రంగా దూషించాడు.

చికిత్సకు సహకరించేలా చూడాలంటూ అతడి కుటుంబ సభ్యులకు నర్స్ సూచించింది. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ విషయాన్ని ఆమె ఆసుపత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయంపై ఆసుపత్రి నర్స్ స్పందించారు. ఆసుపత్రిలో తమకు భద్రతే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతడు.. తన కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ విధంగా వ్యవహరించమే అందుకు కారణమన్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యుడు డాక్టరు మసిదుల్ హసన్ మాట్లాడారు. చోటాచక్ గ్రామానికి చెందిన అబ్బాస్ ఉద్దీన్ తీవ్ర జర్వంతో ఆసుపత్రికి వచ్చాడని తెలిపారు. చికిత్స అందించే క్రమంలో నర్స్ పట్ల అతడు అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. దీంతో ఇలంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. అతడిని వారు అరెస్ట్ చేశారని చెప్పారు.

# వందే భారత్ స్లీపర్ కోచ్‌లను రిలీజ్ చేసిన మంత్రి





దేశంలో త్వరలోనే స్లీపర్ వందే భారత్ రైళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ రైలు దేశంలోని వివిధ రైల్వే మార్గాల్లో ప్రయాణించనుంది. ఈ క్రమంలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నేడు(సెప్టెంబర్ 1న) బెంగళూరులోని ప్రొడక్షన్ యూనిట్‌ని సందర్శించి అక్కడ వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్ ఉత్పత్తిని పరిశీలించారు. ఆ క్రమంలో బీఈఎంఎల్ ఫెసిలిటీలో వందే భారత్ స్లీపర్ కోచ్‌కు సంబంధించిన ప్రోటోటైప్ వెర్షన్‌ను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కోచ్‌ల గురించి కీలక విషయాలను వెల్లడించారు. వందే భారత్ స్లీపర్ రైలు రూపకల్పన, లోపలి భాగం చాలా ఆకర్షణీయంగా ఉందని, అందులో ప్రపంచ స్థాయి సౌకర్యాలు ప్రయాణీకులకు అందించబడుతున్నాయని తెలిపారు.

**సౌకర్యాలు, సెఫ్టీ**

వందే భారత్ స్లీపర్ రైలు.. సౌకర్యం, భద్రత, సామర్థ్యం పరంగా కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేస్తుందని రైల్వే మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ రైలులో యుఎస్‌బీ ఛార్జింగ్, పబ్లిక్ ప్రకటనలు, దృశ్య సమాచార వ్యవస్థ, ఇన్‌సైడ్ డిస్ప్లే ప్యానెల్లు, సెక్యూరిటీ కెమెరాలు, మాడ్యులర్ ప్యాంట్రీతోపాటు ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్లు ఉన్నాయి. ఇంకా వికలాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక బెర్త్‌లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మొదటి %ాజ% కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణికులకు హాట్ వాటర్ షవర్ సౌకర్యం కూడా అందించబడుతుంది.

**వందే భారత్ స్లీపర్ రైలులో ఉన్న సౌకర్యాలు**

ప్యానెల్స్‌తో క్లాస్ ఇంటీరియర్
ఏరోడైనమిక్ బాహ్య రూపం
మాడ్యులర్ చిన్నగది
వికలాంగులకు ప్రత్యేక బెర్త్‌లు, మరుగుదొడ్లు
ఆటోమేటిక్ తలుపులు
సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్ డోర్
చివరి గోడపై రిమోట్‌గా పనిచేసే ఫైర్ బారియర్ తలుపులు
లోకో పైలట్ కోసం టాయిలెట్
ఫస్ట్ క్లాస్ %ాజ%లో వేడి నీటి షవర్లు
ఛార్జింగ్ సదుపాయంతో ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్
బహిరంగ ప్రకటన, దృశ్య సమాచార వ్యవస్థ
పెద్ద లగేజీ సౌకర్యం గది

**ఛార్జీలు**

వందేభారత్ రైలు డిజైన్‌ను మెరుగుపరుస్తున్నామని, అనుభవాల నుంచి నేర్చుకుని దాన్ని మరింత మెరుగుపరుస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. వందేభారత్ మెట్రోకు కూడా ఇదే సూత్రాన్ని అవలంబిస్తామని అశ్విని వైష్ణవ్ అన్నారు. 16 కోచ్‌లతో కూడిన వందే భారత్ స్లీపర్ రైలు 800 నుంచి 1200 కి.మీ ప్రయాణిస్తుందన్నారు. ఈ రైలులో ఆక్సిజన్ స్థాయిలు, వైరస్ రక్షణ వంటి అదనపు ఫీచర్లు కూడా ఉన్నాయన్నారు. ఈ రైలు మధ్యతరగతి ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో దీని ఛార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయన్నారు. తదుపరి పరీక్షల కోసం ఈ రైలు ట్రాక్‌లోకి తీసుకెళ్లడానికి ముందు 10 రోజుల్లో పరీక్ష చేయించుకోవాలని కేంద్ర మంత్రి అధికారులకు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు.

**మూడు వెర్షన్లు**

వందే భారత్ రైలులో మూడు వెర్షన్లు ఉన్నాయి. చైర్ కార్, స్లీపర్, మెట్రో. ఇప్పటివరకు ప్రభుత్వం వందే భారత్ రైళ్లకు చైర్ కార్ వెర్షన్‌ను ప్రారంభించింది. వందేభారత్ స్లీపర్ కోచ్ నిర్మాణాన్ని తాజాగా ఆవిష్కరించారు. ఈ వందే భారత్ స్లీపర్ కోచ్‌ల దృష్టి ప్రయాణికుల సౌకర్యాలపైనే ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. ముందుగా ఐదు నుంచి ఆరు నెలల పాటు ట్రైన్‌సెట్‌ను పరీక్షిస్తామని, ఆ తర్వాతే ప్రారంభిస్తామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. స్లీపర్ రైలు కూడా చైర్ కార్ మాదిరిగానే అదే సాంకేతికతపై ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి ఇది శబ్దం లేని ప్రయాణాన్ని అందిస్తుందన్నారు.

## బాలికపై లైంగిక వేధింపులు..
## బీజేపీ నేత అరెస్ట్, పార్టీ నుంచి బహిష్కరణ

**డెహ్రాడూన్:** బీజేపీ నేత ఒక బాలికను లైంగికంగా వేధించాడు. అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆ బీజేపీ నేతను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి బీజేపీ బహిష్కరించింది. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆగస్ట్ 24న సోదరులతో కలిసి మేకలు మేపేందుకు వెళ్లిన 14 ఏళ్ల కుమార్తెకు బీజేపీ బ్లాక్ అధ్యక్షుడు భగవత్ సింగ్ బోరా చాకెట్లు ఇచ్చాడని, బాలికను లైంగికంగా వేధించాడని, అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆమె తల్లి ఆరోపించింది. ఆగస్ట్ 30న పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాగా, కోర్టు, వైద్యులు, శిశు సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట ఆ బాలిక స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేత భగవత్ సింగ్ బోరాపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయనను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ సంఘటన దురదృష్టకరమని బీజేపీ పేర్కొంది. భగవత్ సింగ్ బోరాను పార్టీ నుంచి బహిష్కరించినట్లు వెల్లడించింది. 'పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి నిందితుడ్ని తొలగించాం.

## హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు..!




మధ్యప్రదేశ్ జబల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ఆదివారం నాగ్‌పూర్‌కు దారి మళ్లించారు. విమానంలో బాంబు బెదిరింపు కారణంగా జబల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన 6ఈ-7308 విమానం ఆదివారం ఉదయం నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించామని ఎయిర్‌లైన్ పేర్కొంది. నాగ్‌పూర్‌లో విమానం ల్యాండ్ అయిన తర్వాత, ప్రయాణికులను దింపివేసి.. ఆ తర్వాత తనిఖీలు నిర్వహించినట్లు చెప్పింది. విమానంలోని వాష్‌రూమ్‌లో పేపర్‌పై బాంబు బెదిరింపు పేపర్ లభ్యమైందని పోలీసులు తెలిపారు. భద్రతా సంస్థలు విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయని, అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదన్నారు. ఆ తర్వాత అదే విమానంలో ప్రయాణికులను గమ్యస్థానానికి తరలించనున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఈ నెల 22న ముంబయి ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దాంతో విమానాన్ని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించి.. ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఎమర్జెన్సీని ఎత్తివేశారు. విమానంలోని టాయిలెట్‌లో టిష్యూ పేపర్‌పై 'ఫ్లైట్‌లో బాంబు ఉంది' అనే సందేశం కనిపించింది. 22న ముంబయి నుంచి తిరువనంతపురం వెళ్తుండగా ఎయిర్ ఇండియా విమానం %ూ×%657లో హెచ్చరిక పేపర్ గుర్తించినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి ఒకరు తెలిపారు.

## రేవంత్ రెడ్డి గారి కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా?



హైదరాబాదులో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ 'హైడ్రా' కదం తొక్కుతున్న సంగతి తెలిసిందే. దీనిపై సినీ నటుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు స్పందించారు. వర్షాలు పడి తూములు తెగిపోయి, చెరువులు, నాలాలు ఉప్పొంగి అపార్ట్ మెంట్ లలోకి కూడా నీళ్లు రావడం, కొన్ని సామాన్య ప్రాణాలు కూడా బలికావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అందుకు ముఖ్య కారణం చెరువులను, నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేయడమేనని నాగబాబు స్పష్టం చేశారు. "తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేపట్టిన హైడ్రా కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా? రేవంత్ రెడ్డి గారు తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని, నిబద్ధతతో కూడిన చర్యలను మనమందరం అభినందిద్దాం. రేవంత్ రెడ్డి గారూ... మా సంపూర్ణ సహకారం మీకే" అంటూ నాగబాబు సోషల్ మీడియాలో స్పందించారు.

## మణిపూర్‌లో కాల్పులు..
### మహిళ మృతి, ఆమె కుమార్తె ఇద్దరు పోలీసులకు గాయాలు



**ఇంఫాల్:** మణిపూర్‌లో అనుమానిత తిరుగుబాటుదారులు కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో ఒక మహిళ మరణించింది. 12 ఏళ్ల ఆమె కుమార్తెతోపాటు ఇద్దరు పోలీసులు కూడా గాయపడ్డారు. కుకీ తీవ్రవాదులు ఆ మహిళను కాల్చి చంపినట్లు మైతీలు ఆరోపించారు. అలాగే ఒక ఇంటిపై డ్రోన్ ద్వారా బాంబు దాడి జరిగినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కుకీల ఆధిపత్యం ఉన్న కాంగ్‌పోక్పిలోని నఖుజాంగ్ గ్రామం నుంచి మైతీల ఆధిపత్యం ఉన్న ఇంఫాల్ వెస్ట్‌లోని కదంగ్‌బండ్ వైపు కాల్పులు జరిగాయి. దీంతో కదంగ్‌బండ్ నుంచి కూడా కాల్పులు ప్రారంభమయ్యాయి. కాగా, కాల్పుల్లో గాయపడిన కదంగ్‌బండ్‌కు చెందిన 31 ఏళ్ల నగాంగ్‌బామ్ సుర్బాలా అనే మహిళను ఇంఫాల్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే ఆమె అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. కుకీ ఉగ్రవాదులు ఆ మహిళను హతమార్చారని మైతీలు ఆరోపించారు. అయితే కాంగ్‌పోక్పిలోని కుకీ గ్రామాలపై మైతీలు తొలుత కాల్పులు జరిపినట్లు కుకీ తెగకు చెందిన వారు సోషల్ మీడియాలో కౌంటర్ ఆరోపణలు చేశారు. మరోవైపు ఇరువైపులా కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసులు కూడా గాయపడినట్లు చెప్పారు. అయితే గాయపడిన పోలీసులకు ఎలాంటి ప్రమాదం లేదని వెల్లడించారు. కాగా మణిపూర్‌లోని మెజారిటీ వర్గమైన మైతీలకు రిజర్వేషన్ కల్పించడాన్ని మైనారిటీ వర్గమైన కుకీలు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో 2023 మే నుంచి ఈ రెండు జాతుల మధ్య ఘర్షణలు, పోరాటాలు జరుగుతున్నాయి. దాడులు, ప్రతి దాడుల్లో వందలాది మంది మరణించగా వేలాది మంది నిరాశ్రులయ్యారు.

## 1962 ఇండో-చైనా యుద్ధం నాటి మోర్టార్ స్మోక్ బాంబు లభ్యం..?

భారత్-చైనా దేశాల మధ్య 1962లో జరిగిన యుద్ధం సమయంలో చైనా వినియోగించిన మోర్టార్ స్మోక్ బాంబు అస్సాంలో లభ్యమైంది. ఇది చైనాలో తయారు చేసిన బాంబు అని సోనిత్ పూర్ ఎస్పీ తెలిపారు. 1962 యుద్ధంలో ఈ బాంబును దట్టమైన పొగను వ్యాపింపజేయడానికి ఉపయోగించినట్లు చెప్పారు. అస్సాంలోని సోనిత్ పూర్ జిల్లాలో ఈ మోర్టార్ స్మోక్ బాంబును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జౌగాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం సేసా నదిలో ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లాడు. నదిలో రెండు అంగుళాల పొడవు కలిగిన పేలుడు పదార్థాన్ని గుర్తించాడు. దానిని బయటకు తీసుకొచ్చాడు. ఈ విషయాన్ని స్థానిక మిషనరీ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అతని వద్దకు చేరుకుని స్మోక్ బాబును స్వాధీనం చేసుకున్నారు. సోనిత్ పూర్ ఎస్పీ బరున్ పుర్కాయస్త ఇచ్చిన సమాచారం మేరకు ఆర్మీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. లెఫ్టినెంట్ కల్నల్ అభిజిత్ మిశ్రా నేతృత్వంలోని మిసామరి క్యాంప్‌కు చెందిన ఆర్మీ బృందం ఆ మోర్టార్ స్మోక్ బాంబును ధ్వంసం చేసింది. ఈ మోర్టార్ స్మోక్ బాంబు ఒక రకమైన మందుగుండు సామాగ్రి. శత్రువుల కాల్పులను నివారించడానికి, శత్రువుల నిఘా నుంచి తప్పించుకోవటానికి ఈ స్మోక్ బాంబును వినియోగించేవారని ఎస్పీ తెలిపారు.

# స్టేట్ సేఫ్ తెలంగాణ..

-మొదటిపేజీ తరువాయి

రెండు రాష్ట్రాల్లోనూ కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జన జీవితాన్ని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో వర్షాలకు వరదగా వరద పోటెత్తుతోంది. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు పరివాహకంలోని 15 కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కాలనీలు నీటమునగడంతో బాధితులు ఇళ్ల పైకి చేరుకున్నారు. బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోవడంతో ఇళ్ల పైకి చేరుకుని రక్షించాలంటూ ఆర్తనాదాలు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పందించారు. – రాష్ట్రవ్యాప్తంగా వరదల పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఖమ్మంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సరే ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయిన



ప్రజలు ఖమ్మంలోని త్రీ టౌన్ ప్రాంతంలో వీధుల్లో నిరసనకు దిగారు. కనీస సాయం కోసం వరదల సమయంలో ప్రజలు ఇలా ఆందోళన చేయడం అంటే ప్రభుత్వం ఎంత ఉదాసీన వైఖరితో ఉందో అర్థం చేసుకోవచ్చు– అని కేటీఆర్ ట్వీట్ చేశారు. మరోవైపు ప్రభుత్వం సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్ చేశారు.

**సహాయక చర్యల్లో మంత్రి తుమ్మల..**

కాగా, ఖమ్మం వద్ద మున్నేరు వరద ఉధృతిని మంత్రి తుమ్మల పరిశీలించారు. ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు బ్రిడ్జి పై వరదలో చిక్కిన వారిని రక్షించేందుకు జరుగుతున్న సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, హెలికాప్టర్‌తో రెస్క్యూ చర్యలు చేపట్టాలని మొదట్లో తెలంగాణ ప్రభుత్వం భావించింది. అయితే వాతావరణం అనుకూలంగా లేక పోవడంతో హెలికాప్టర్‌తో రెస్క్యూ ఆపరేషన్‌ను సోమవారం ఉదయానికి వాయిదా వేశారు.

**మహబూబ్ నగర్ స్కూళ్లకు రేపు సెలవు..**

రేపు కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ స్పందించారు. సోమవారం నాడు జిల్లాలోని పాఠశాలలన్నింటికీ సెలవు ఇస్తున్నట్టు ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని సూచించారు.

# 11 జిల్లాల్లో రెడ్ అలెర్ట్..
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో జిల్లాల వారీగా టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశామని, ప్రజలు ఏ అవసరం ఉన్నా కాల్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, జనగామ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మహబూబాబాద్ వంటి 11 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ రోజు ఉదయం 4 గంటల నుంచే వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ శాఖ క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి నిరంతరం సమీక్షస్తున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎలాంటి పరిస్థితుల్లోనైన ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అంతే కాదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పిన మంత్రి.. హైడ్రాతో గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరణ చేస్తున్నామని.. వచ్చే ఏడాది నుంచి హైదరాబాద్ కు వరద ముంపు ఉండదని.. అయన చెప్పారు. ఇక నల్గొండ జిల్లాలో గత 24 గంటలుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు.. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లాల్లో గ్రామాల వారీగా కురుస్తున్న వర్షాపాతం.. జిల్లాలోని తాజా వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు కలెక్టర్ తో సమాచారం



తెప్పించుకుంటున్న మంత్రి.. కలెక్టర్ తో పాటు ఇతర జిల్లా అధికారులకు నిరంతరం సూచనలు చేస్తున్నారు. వర్షం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్కరు విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో ఇళ్లలోకి నీరు వచ్చే ప్రాంతాలను గుర్తించడంతో పాటు.. విద్యుత్ సరఫరా విషయంలో తగు జాగ్రత్తలు తీసకోవాలని, స్తంభాలకు విద్యుత్ సరఫరా జరగకుండా ఎలక్ట్రిటీ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది వీధివీధిలో అలెర్ట్‌గా ఉండి మ్యాన్ హోల్స్ అడ్డంకులను తొలగించి వర్షపునీరు వెళ్లేలా చూడాలని చెప్పారు. కూలిపోయేందుకు అవకాశం ఉన్న ఇండ్లలో ఉంటున్న ప్రజలను తక్షణం ఖాళీ చేయించాలని.. ఎంతమంది ప్రజలు వచ్చినా ఇబ్బందులు రాకుండా ఉండేలా పునరావాసా కేంద్రాన్ని తక్షణం అందుబాటులోకి తేవాలని మంత్రి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇవే కాకుండా.. గ్రామాలు, పట్టణాలలోని మంచి నీటి ట్యాంకులు కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టడంతోపాటు, అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ లను చేపట్టాలని తెలిపారు. అంతేకాదు, వైద్య బృందాలను అప్రమత్తం చేయాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగు మందులను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అత్యవసరం అయితే తప్పా ఇళ్లు విడిచి బయటకు రారాదని.. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఉంటే ప్రభుత్వ కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు, ట్రాన్స్ కో, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులంతా అందుబాటులో ఉంటూ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేసే విధంగా సిబ్బంది 3 షిఫ్టులుగా ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. నల్గొండ ప్రజలకు ఏదైన తక్షణ సహాయం అవసరంఉంటే.. 1800 4251 442 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ప్రాణహాని, ఆస్తి నష్టం జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండి పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని.. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా కల్పించారు.

# అధికారుల్లో హైడ్రా చిచ్చు

-మొదటిపేజీ తరువాయి

వారందరిపైనా ఇవే కేసులు పెడతారా? అన్న ప్రశ్న తలెత్తుతున్నది. అధికారులపై కేసు.. ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదంగా మారినట్టు సమాచారం. తమకు తెలియకుండానే కేసులు నమోదు చేయటంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి ఒకరు పోలీసులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. హైడ్రా కమిషనర్, పోలీస్ ఉన్నతాధికారులను పిలిచి ఇదేం పద్ధతి అని నిలదీసినట్టు సమాచారం. 'మీరు ఇట్లా కేసులు పెట్టేముందు మాకెందుకు చెప్పలేదు. ఇట్లా కేసులు పెట్టి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి మెసేజ్ పంపిస్తున్నట్టు?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఒక్క వీరితోనే ఆపేస్తారా? ఒక్క వీళ్లు మాత్రమే తప్పు చేశారంటారా? అని పలువురు ఐఏఎస్‌లు హైడ్రా అధికారులను నిలదీసినట్టు సమాచారం. ఐఏఎస్‌లను కాదని, ఐపీఎస్‌ను ప్రభుత్వం కమిషనర్‌గా పెట్టడంపైనా పలువురు ఐఏఎస్‌లు తప్పుపడుతున్నట్టు తెలిసింది. అడ్మినిస్ట్రేషన్‌లో ఇంత పెద్ద బాధ్యత ఒక ఐపీఎస్ చేతిలో పెట్టడం ఏమిటి? అని ఇటీవల సచివాలయంలో అత్యంత కీలకమైన ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

**కట్టిన బిల్డర్లపై చర్యలుండవా?**

బిల్డర్లపై హైడ్రా ఎందుకు కేసులు పెట్టడం లేదన్న చర్చ



జరుగుతున్నది. చెరువుల వద్ద ఇండ్లు కట్టిన, అపార్ట్‌మెంట్లు, వెంచర్లు వేసి, భవనాలు కట్టినవారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. అధికారులను లక్ష్యంగా చేసుకోవడమేమిటన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో జరుగుతున్నది. ఇదే విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో రాష్ట్ర ఉన్నతాధికారి ఒకరు స్వయంగా అన్నట్టు తెలిసింది. అధికారులపై కేసులు పెట్టేముందు వారి శాఖలతో సంబంధం ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వడం కనీస మర్యాద, పద్ధతి అని స్పష్టం చేసినట్టు సమాచారం. ఉద్యోగులపై కేసులు పెట్టడం ప్రభుత్వ పాలసీ కాదని, తాను రాష్ట్రంలో ఉన్నతాధికారిగానే ఉన్నానని పేర్కొన్నట్టు తెలిసింది.

## అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. మరోవైపు ఎల్లంపల్లికి వచ్చిన వరద నీటిని వీల్కెనంత మేరకు లిఫ్ట్ చేయాలని, రోజుకు ఒక టీఎంసీ తగ్గకుండా డ్రా చేయాలని అధికారులు ఆదేశించారు. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌తో పాటు రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్ వరకు జలాశయాల్లోకి ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.45 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి ప్రవాహం ఉద్ధృతంగా వస్తుండటంతో నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు నీటిని అధికారులు పంపిస్తున్నారు. ఇక మిడ్‌మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27 టీఎంసీలు కాగా ప్రస్తుతం 15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అక్కడి నుంచి 14 వేల క్యూసెక్కులకు పైగా లోయర్ మానేరు డ్యామ్‌కు, మరో 6,400 క్యూసెక్కులు అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా రంగనాయక్ సాగర్‌కు తరలిస్తున్నారు. మరోవైపు రంగ నాయక సాగర్ నుంచి నీటిని పంపింగ్ చేసి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపాలని, అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్ట్, నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరకు నీటిని తరలించాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో సాధ్యమైనంత వరకు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మల్లన్నసాగర్‌లో గరిష్ఠంగా 18 నుంచి 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీలు నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని ముందు జాగ్రత్తలు పాటించాలని ఆయన అప్రమత్తం చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించాలని ఆయన సూచనలు చేశారు.

## తెలంగాణ-ఏపీ మధ్య నిలిచిన రాకపోకలు..

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో వాగులు వంకలు పొంగుతున్నాయి. ఈ క్రమంలో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. చిమిర్యాల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో ఏపీ–తెలంగాణ సరిహద్దులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉగ్రరూపం దాల్చింది. కోదాడ దిగువన చిమిర్యాల వాగు, పాలేరు భీకరంగా ప్రవహిస్తున్నాయి.

కోదాడ నుంచి దిగువకు భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. దాంతో చిమిర్యాల వద్ద జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణ – ఏపీ మధ్య నిలిచిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ – ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తుంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇక ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. హైవేపై మోకాళ్ల లోతు వరద ఉండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు రాకుండా పోలీస్ రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ వైపు చిలకల్లు టోల్ ప్లాజా వద్ద, విజయవాడ వైపు కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాలను నిలిపివేశారు. దీంతో హైవే పూర్తిగా స్తంభించిపోయింది. వరద ఉధృతి తగ్గే వరకు వాహనాలను హైవేపైకి అనుమతించబోమని నందిగామ ఆర్డీవో తెలిపారు. ఇక నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. బస్సులోని 30 మంది ప్రయాణికులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. రహదారులపైకి నీరు చేరుకోవడంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటికి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## అధికారులకు సెలవులు రద్దు చేసి..
## 24 గంటలు అప్రమత్తంగా ఉండండి

**భారీ వర్షాల నేపథ్యంలో హరీశ్‌రావు సూచన**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఎక్కడికక్కడ అత్యవసర సేవలు అందించేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. అవసరమైతే సైన్యం సహాయం తీసుకోవాలని.. ప్రత్యేక హెలికాప్టర్లను తెప్పించాలని అన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో రాత్రిపూట నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కరవడంతో 14 మంది విద్యార్థులు గాయపడటంతో.. ఆ గురుకుల పాఠశాలను మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ఆదివారం ఉదయం స్పందించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పూర్తిగా నిండిన చెరువులు, కాలువలు తెగకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆపదలో ఉన్న బాధితులకు సహాయక చర్యలు అందించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని అంటున్నారని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు సెలవులు రద్దుచేసి 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదకరంగా ప్రవహించే వరదల్లో, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. పోలీసులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా కాపాడాలని కోరారు.

## మరో డీఎస్సీకి సన్నాహాలు

-మొదటిపేజీ తరువాయి

సమాచారాన్ని జిల్లాల వారీగా సేకరిస్తోంది. ఇందుకు సంబంధించి ఖాళీలు ఎన్ని ఉన్నాయనే అంశంపై అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే 11,062 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించి ప్రాథమిక కీని విడుదల చేశారు. సెప్టెంబరు మొదటి వారంలో ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. ఆ తర్వాత అక్టోబరు నెలాఖరు నాటికి జిల్లాల వారీగా నియామకాలను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. అవి కాగానే కొత్త డీఎస్సీని ప్రకటించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.కొత్త డీఎస్సీ కోసం రాష్ట్రంలో భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య ఏ మేరకు ఉండవచ్చనే అంశంపై అధికారులు జిల్లాల వారీగా సమాచారం సేకరిస్తున్నారు. పాఠశాలల సంఖ్య, అందులోని విద్యార్థులు, ఖాళీల వివరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ప్రకటించిన డీఎస్సీ ద్వారా నియమితులయ్యే ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చిన తర్వాత.. ఇంకా ఎన్ని ఖాళీలు ఉంటాయన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కాగా, పాఠశాలల్లో ఖాళీలు ఉన్నా.. వాటిని భర్తీ చేయడంలో సమస్యలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య యేటా పడిపోతోంది. దాంతో చాలాచోట్ల టీచర్ పోస్టులున్నా.. అందుకుతగ్గట్లుగా విద్యార్థులు లేరు. ఇలాంటి సందర్భంలో క్రమబద్ధీకరణను అమలు చేయాలి. ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఇతర పాఠశాలలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు అలాంటి ప్రయత్నం జరగడం లేదు. ఈ పనిచేసిన తర్వాతనే ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటే ప్రయోజనం అన్న అభిప్రాయం వినిపిస్తోంది.తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 2,79,957 దరఖాస్తులు అంగా... మొత్తం 2,45,263 మంది (87.61 శాతం) పరీక్షలకు హాజరయ్యారు. డీఎస్సీ పరీక్షలకు 34,694 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు 92.10 శాతం హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబరు 5 నాటికి నియామక పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వ యోచనగా ఉంది.తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు తమకు ఉద్యోగాలివ్వాలని కోరుతూ 2008–డీఎస్సీ బాధితులు సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి తరలివచ్చారు. డీఎస్సీ–2008 సాధన సమితి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 200 మందికిపైగా అభ్యర్థులు వచ్చారు. కాగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆరుగురు ప్రతినిధుల బృందాన్ని సీఎం నివాసంలోకి అనుమతించారు. తమకు ఉద్యోగాలివ్వాలని హైకోర్టు ఫిబ్రవరి 8న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని వారు ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి జైపాల్ రెడ్డికి తెలిపారు.

# దృశ్యాదృశ్య జ్ఞాన సంగమమే మానవ జీవితం

**(హైదరాబాద్/శుభ తెలంగాణ)** కంటికి కనిపించేది మాత్రమే సత్యమనీ, మనకి కనిపించనంత మాత్రాన నిజం లేదనుకోవడానికి లేదనీ, దాన్ని 'విశ్వర్షి' డా. వాసిలి వసంత కుమార్ రచించిన'ఏడోఋతువు' కవితాత్మకంగా దీన్ని ఎంతో తాత్వికంగా చెప్పారని హెచ్ సియు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం, భారతీయ కాలమానం ప్రకారం శనివారం రాత్రి సమయంలో అమెరికాలోని సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాలం ద్వారా జరిగిన సమావేశంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు.ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి




లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దర్భశయనం చంద్రశేఖర్ రచించిన 'చిగురించిన శిలాజం' కవితా సంపుటి ఆవిష్కరణ, డా.వాసిలి వసంతకుమార్ రచించిన 'ఏడోఋతువు' కావ్యపరిచయాలను చేశారు.ఏడోఋతువులో తాత్విక చింతన, చిగురించిన శిలాజంలో సమకాలీన సామాజిక జీవనం,శాస్త్రవిషయాలు ఎలా ఆవిష్కృతమయ్యా యో వక్తలు సోదాహరణంగా విశ్లేషించారు.డా.వాసిలి రచనలపై దర్భశయనం మాట్లాడగా, దర్భశయనం రచనపై డా. వాసిలి మాట్లాడ్డం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ రెండు రచనలపై ప్రముఖ రచయితలు, రచయిత్రులు నివర్తి మోహన్ కుమార్,వేణు ఆసూరి,డా రవూఫ్,ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డా.పాతూరి అన్నపూర్ణ, డా.శ్రీనివాసులు తదితరులు లోతైన విశ్లేషణలు చేశారు.

## ఎస్ఏఈ-ఇండియా పోటీలలో పలు బహుమతులు

# గెల్చుకున్న ఎంఎల్ఆర్ఐటీ ఏరోనాటికల్ విద్యార్థులు....

**(హైదరాబాద్/శుభ తెలంగాణ)** మర్రిలక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు,విభాగాధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా,ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు ఏ. సాయికుమార్,ఎస్.శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన ఎస్ఏఈ-ఇండియా పోటీలలో మూడు బహుమతులు గెలుచుకున్నారు.ఈ పోటీలలో ఎంఎల్ఆర్ఐటీ నుంచి నాలుగు టీమ్స్ - టీం ఐరావత్,టీం ఏలస్,టీం వాయుపుత్ర మరియు టీం డార్క్ సైడర్స్ - పాల్గొన్నాయి.ఈ పోటీల్లో టీం ఏలస్,కెప్టెన్ హర్షిత యాదవ్ ఆధ్వర్యంలో,బెస్ట్ ఇన్నోవేషన్ మైక్రో క్లాస్ అవార్డులో మొదటి బహుమతి మరియు పదివేల రూపాయల నగదు బహుమతి గెలుచుకుంది.అలాగే,టీం ఐరావత్,కెప్టెన్ ఇషాన్ సూరి నేతృత్వంలో,బెస్ట్ ఇన్నోవేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డులో రెండవ బహుమతి మరియు బెస్ట్ ప్రెజెంటేషన్







రెగ్యులర్ క్లాస్ అవార్డులో మూడవ బహుమతిని సాధించింది.ఈ విజయాల నేపథ్యంలో ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి,సెక్రటరీ మరియు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మరియు ప్రిన్సిపల్ డాక్టర్ కే. శ్రీనివాసరావు లు,తమ కళాశాల ఏరోనాటికల్ విభాగం విద్యార్థులు మూడు ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన విభాగాధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు ఏ. సాయికుమార్ మరియు ఎస్. శ్రీకాంత్,అలాగే విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# వర్షాకాలంలో ప్రమాదాలను నివారించేందుకు జాగ్రత్తలు

**వర్షాకాలంలో ప్రజలు ముఖ్యంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు....**

**విద్యుత్ తీయులకు, స్తంభాలకు దూరంగా ఉండడం..**

**రోడ్డు గుంతల్లో నీరు నిల్వ ఉండటం గమనించకపోవడం ప్రమాదకరం.**

**నీళ్లు నిలువ ఉంచడంతో దోమల వలన వ్యాధులు ప్రవళించే అవకాశం ఉంటుంది.**

**(శుభ తెలంగాణ ప్రత్యేకం)** వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..వర్షాకాలం ప్రారంభమయ్యే సరికి వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది,కానీ అదే సమయంలో ప్రమాదాలకి అవకాశం పెరుగుతుంది. వర్షం వల్ల రోడ్లపై నీటి నిల్వ,రవాణా అంతరాయం, విద్యుత్ సరఫరా సమస్యలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది.ఈ నేపథ్యంలో,శుభ తెలంగాణ మీడియా ప్రజలందరికీ కింద చెప్పిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తుంది. 1.రోడ్డు ప్రయాణాల్లో జాగ్రత్తలు-వర్షం పడే సమయంలో రోడ్లపై నీటి నిల్వలు ఉంటాయి. కనుక వాహనదారులు అదనపు జాగ్రత్తలు



తీసుకోవాలి.-వేగాన్ని నియంత్రించండి.రోడ్లు తడిగా ఉండటంతో టైర్లకు గ్రిప్ తగ్గిపోవచ్చు,ఇది ప్రమాదాలను పెంచుతుంది.
-ముందున్న వాహనానికి సురక్షిత దూరం పాటించండి.
-రోడ్లపై ఉన్న గుంతలను గమనించండి.అవి ప్రమాదాలకు కారణం కావచ్చు.

2.విద్యుత్ సరఫరా సంబంధిత జాగ్రత్తలు - వర్షం పడినప్పుడు చెట్లపై ఉన్న విద్యుత్ తీగలు నేలపై పడే అవకాశం ఉంటుంది.వీటిని తాకకుండా జాగ్రత్తపడండి.-మీ ఇంటి కి ఎలక్ట్రికల్ మైంటెనెన్స్ చెయ్యించుకోవడం ద్వారా ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కాకుండా ఉంటుంది.-వర్షంలో తడి ఉన్నప్పుడు ఎలక్ట్రికల్ సామగ్రిని వాడకుండా జాగ్రత్తపడండి.
3.నీటి నిల్వలను నివారించండి-వర్షాకాలంలో నీటి నిల్వ వల్ల డెంగీ,మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది.కాబట్టి, నీటి నిల్వలను తొలగించండి.-పైన ట్యాంకులు,బకెట్లు కప్పివేయడం ద్వారా నీటి నిల్వలను నిరోధించండి.
4.బహిరంగ ప్రదేశాల్లో జాగ్రత్తలు-వర్షం పడే సమయంలో రోడ్లపై నీరు నిల్వవచ్చు.వర్షంలో నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.-వాహనదారులు, వర్షంలో వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరం.
5.ఆరోగ్య సంరక్షణ-వర్షం వల్ల తడి వాతావరణం ఉత్పత్తి అవుతుంది.ఇది శ్వాస సంబంధిత సమస్యలను కలిగించే అవకాశం ఉంది.కాబట్టి, సురక్షితమైన నీరు మాత్రమే తాగండి.-తరచూ చేతులు కడగడం అలవాటు చేసుకోండి.-వర్షంలో తడవకుండా ఉండటానికి రక్షణ చర్యలు తీసుకోండి. మీ ఆరోగ్యాన్ని అలాగే మీ ప్రాంతాన్ని సురక్షితంగా కాపాడుకోవడానికి మా శుభ తెలంగాణ పత్రిక ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

# తెలంగాణకు ఐఎండీ రెడ్ అలర్ట్, అతి భారీ వర్షాలు విద్యాసంస్థలకు సెలవు..

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు దంచి కొడుతున్నాయి. ఏపీతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు పడుతున్నాయి. తాంతో వాతావరణ శాఖ తెలంగాణకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అటు హైదారాబాద్ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కాస్తా వాయుగుండమై తీరం దాటనుంది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో 29 సెంచీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధిరలో 20 సెంటీమీటర్లు, మహబూబాబాద్‌లో 16.9 సెంటీమీటర్లు, నెక్కొండలో 25.9 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది.


**తెలంగాణలో ఏ జిల్లాలకు ఏ అలర్ట్ జారీ..!!**

అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణ పేట్, గద్వాల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడవచ్చు. ఇక కొమురం భీమ్, ములుసు భద్రాద్రి, వరంగల్, ఖమ్మం, హనుమకొండ, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయి. ఇక రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట,



భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్ గిరి, మెదక్ జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ అయింది. ఈ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడనున్నాయి. తెలంగాణలో మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పొంచి ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్ సహా తెలంగాణలో పలు జిల్లాల్లో విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచిస్తున్నారు. మరోవైపు రాత్రి నుంచి హైదరాబాద్ నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షం నమోదవుతోంది.

## నిండుకుండలా హుస్సేన్‌సాగర్..



**హైదరాబాద్ సిటీ:** భారీ వర్షాలతో హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. బంజారాహిల్స్, పికెట్, కూకట్‌పల్లి నాలాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో సాగర్‌కు భారీగా వరద చేరుతోంది. నీటిమట్టం ఫుల్ ట్యాంక్‌లెవల్ దాటడంతో తూముల ద్వారా నీటిని మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. హుస్సేన్‌సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ 513.41 మీటర్లు కాగా, ప్రస్తుతం 513.43 మీటర్లుగా ఉంది..

## భారీ వర్షాలు.. ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి దామోదర సమీక్ష



**హైదరాబాద్‌శుభ తెలంగాణ:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటం, సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులతో సమావేశమయ్యారు. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. వర్షాలు తగ్గే వరకు ఆసుపత్రుల్లో సిబ్బందికి సెలవులు మంజూరు చేయొద్దని డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్‌ను ఆదేశించారు. డాక్టర్లు, స్టాఫ్ అందరూ హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, ప్రతి ఒక్కరూ డ్యూటీలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్(ఈడీడీ) దగ్గరగా ఉన్న గర్భిణులను ముందే హాస్పిటళ్లకు తరలించి, వెయిటింగ్ రూమ్స్ కేటాయించాలని ఆదేశించారు. గర్భిణికి, ఆమెతో వచ్చిన కుటుంబ సభ్యులకు భోజన వసతి కల్పించాలన్నారు. అంబులెన్స్ సర్వీసులు అన్ని చోట్ల అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మెడిసిన్, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పేషెంట్లకు అందించే ఆహారం, తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తర్వాత దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, తగ్గుముఖం పట్టిన వెంటనే జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇందుకోసం పంచాయతీరాజ్, పురపాలక శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల హాస్టళ్లలో స్టూడెంట్స్‌కు అందజేసే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో పిల్లలకు అందించే భోజనం విషయంలోనూ తగిన జాగ్రత్తలు పాటించేలా సంబంధిత శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు..

## సీఎం, స్పీకర్ జిల్లాలో ఐఏఎస్ ఆఫీసర్ల అక్రమ కబ్జా

### -బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్ గౌడ్

**వికారాబాద్ శుభ తెలంగాణ:** వికారాబాద్ జిల్లాలో కబ్జాకు గురైన చెరువు ఎఫ్టీఎల్ భూములను ఐఏఎస్ ఆఫీసర్ల చెర నుంచి విడిపించాలని టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివారెడ్డి చెరువులో హైదరాబాద్ జిహెచ్ఎంసి కమిషనర్ గా ఉన్న ఆమ్రపాలి, ఖమ్మం జిల్లా కలెక్టర్ శివరెడ్డిపేట్ చెరువులోని ఎఫ్ టి ఎల్ లో అక్రమంగా ఇల్లు నిర్మించుకున్నారని వాటిని హైదరా మాదిరిగా




కూలగొడతారా లేదా సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వికారాబాద్ జిల్లాను అభివృద్ధి చేయలేదని పదేపదే వేదికల మీద చెప్తున్న సీఎం రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాగా చెబుతున్న వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. కొడంగల్ ప్రాంతానికి రూ.5,000 తీసుకు వెళ్లిన ఆయన దళితుడైన నియోజకవర్గం స్పీకర్ గా ఉన్న జిల్లా కేంద్రానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని లక్నాపూర్, సర్పన్ పల్లి, కోట్ పల్లి ప్రాజెక్టుల పరిధిలో ఆక్రమణకు గురైన స్థలాలను విడిపించాలని డిమాండ్ చేశారు.

## జిల్లాలో వర్షం కారణంగా నేడు పాఠశాలలు బంద్..

**వికారాబాద్‌శుభ తెలంగాణ:** జిల్లా లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా,అలాగే సోమవారం సైతం భారీ ,అతి భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు . అందువల్ల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల యజమాన్యాలు సోమవారం పాఠశాలలను తెరవవద్దని ఆయన ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ఆదేశాలను కాదని ఎవరైనా పాఠశాలలు తెరిచినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# బిలీయనీర్స్‌లో ముంబై తర్వాత హైదరాబాదే



**హైదరాబాద్‌శుభ తెలంగాణ :** ఇండియాలో బిలియనీర్లు పెరుగుతున్నారా? స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోతోంది.. మరి బిలియనీర్ల మాటేంటి? ఇండియాలో ఎవరు కుబేరుల య్యారు? టాప్‌లో ఏ సిటీ ఉంది? ఇందులో హైదరాబాద్ స్థానమెంత? చివరి స్థానం ఎవరు? చాలామంది టాప్ ఉన్నత స్థాయి వర్గాలు చ ర్చించుకుంటున్నాయి. తాజాగా హురూన్ ఇండియా ఫుల్‌స్టాప్ పెట్టిందా? లోతుల్లోకి వెళ్దాం..చైనా రాజధాని బీజింగ్ బిలియనీర్లు కేరాఫ్‌గా మారింది. చైనా రాజధాని బీజింగ్ నుంచి ఎక్కువ మంది బిలియనీర్లు వచ్చేవారు. దాన్ని అధిగమించింది ముంబై సిటీ. ఒకప్పుడు బీజింగ్ నుంచి 91 మంది రాగా, ముంబై 92 మంది బిలియనీర్లకు కేరాప్‌గా మారింది.ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిలియనీర్ రాజధానిగా ముంబై మారింది. ప్రపంచంలో బిలియనీర్ల పరంగా చూస్తే న్యూయార్క్ (119) తొలి స్థానం, లండన్ (97) తర్వాత మూడవ స్థానంలో ముంబై నిలిచింది. మరో నాలుగేళ్లలో సెకండ్ ప్లేస్‌కు ముంబై చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2014 పేరుతో దేశంలోని కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఇండియాలో అత్యంత సంపద కలిగిన వ్యక్తిగా బిజినెస్ మేన్ అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ టాప్ వన్‌లో నిలిచారు. సంపద విలువ ఏడాది కాలంలో 95శాతం పెరిగి అక్షరాలా 11.6 లక్షల కోట్లకు చేరింది. ఆ తర్వాత ముకేష్ అంబానీ 10.14 లక్షలో సెకండ్ ప్లేస్‌లో నిలిచారు.పదేళ్ల కిందట టాప్ -10లో ఉండే అదానీ, ఇప్పుడు ఫస్ట్ ప్లేస్ దక్కించుకున్నారు. ఆ తర్వాత హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్, సీరమ్ ఇన్ స్టిట్యూట్, సన్ ఫార్మాలు వరుసగా మూడు, నాలుగైదు స్థానాల్లో నిలిచారు. రాష్ట్రాల పరంగా చూస్తే కుబేరుల జాబితాలో మహారాష్ట్ర తొలిస్థానం సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు వరసగా నిలిచాయి. టాప్ 10లో ఏపీ చోటు దక్కలేదు. నాలు గేళ్ల కిందట ఆరో స్థానంలో నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు ఐదుకి ఎగబాకింది.బిలియనీర్లకు కేరాఫ్‌గా మెట్రోపాలిటిన్ సిటీలు నిలుస్తున్నాయి. 386 మంది బిలియనీర్లతో ముంబై అగ్రస్థానం దక్కించుకుంది. నాలుగేళ్ల కిందట 217 మంది మాత్రమే ఉండేవారు. సెకండ్ ప్లేస్‌లో న్యూఢిల్లీ నిలిచింది. 217 మంది బిలీయనీర్లు అక్కడి నుంచి వచ్చారు. నాలుగేళ్ల కిందట అందులో సగం ఉండేది. కుబేరు లకు కేంద్రంగా మారుతోంది హైదరాబాద్. ధనవంతుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. నాలుగేళ్ల కిందట కేవలం హైదరాబాద్ నుంచి 50 మంది మాత్రమే ఉండేవారు.. ప్రస్తుతం 104 మంది బిలియనీర్లు ఉన్నారు. ఈ విషయంలో బెంగూళూ రును వెనక్కి నెట్టేసింది. దీని తర్వాత బెంగుళూరు 100 మందితో నాలుగులో స్థానంలో నిలిచింది. తర్వాత చెన్నై నిలిచింది.తెలంగాణ నుంచి దివీస్ లేబరేటరీస్, పిచ్చిరెడ్డి- మేఘా ఇంజనీరింగ్, కృష్ణారెడ్డి-మేఘా ఇంజనీరింగ్, పార్థసారథి-హెటెరో ల్యాబ్స్, అపర్ణ కన్ స్ట్రక్షన్స్, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ వంటి కంపెనీలు నిలిచాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా నిలుస్తోందని చెప్పవచ్చు.

# హైడ్రా పొలిటికల్ టచ్ ఇస్తోందా



**హైదరాబాద్ శుభ తెలంగాణ:** తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఒకప్పుడు చెరువులు, కుంటలతో విలసిల్లేది. ఎప్పుడైతే అభివృద్ధి చేస్తామని పాలకులు కంకణం కట్టుకున్నారో.. అప్పటి నుంచి హైదరాబాద్ తన రూపును కోల్పోవడం ప్రారంభమైంది. చెరువులు నాశనమయ్యాయి. కుంటలు కాలగర్భంలో కలిసిపోయాయి. నాలాలు నామరూపాలను కోల్పోయాయి. ఫలితంగా వర్షం కురిస్తే చాలు హైదరాబాద్ నగరం నీట మునిగిపోతోంది. ఒకప్పుడు చెరువులతో అద్భుతమైన ప్రాంతంగా ఉన్న హైదరాబాద్.. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చిగురుటాకులా వణికి పోతోంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత.. చెరువులను చెరబట్టి ఆక్రమించిన నిర్మాణాలను పడగొట్టేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ చివరి నిమిషంలో విరమించుకుంది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ కోసం, ఆక్రమణలను తొలగించేందుకు హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీనికి చైర్మన్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను నియమించింది.. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రంగనాథ్ ఆధ్వర్యంలో హైడ్రా హైదరాబాద్ నగరంలో చెరువుల్లోని ఆక్రమణలను క్రమంగా తొలగిస్తోంది.. చెరువులను చెరబట్టారని తెలిస్తే చాలు కూల్చి పడేస్తోంది. ఇందులో పార్టీలతో సంబంధం లేకుండా హైడ్రా దూసుకు వెళ్తోంది. మొదట్లో దీనికి ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నాయకులు రాజకీయరంగు పులిమేందుకు ప్రయత్నించారు. ఈ ఆరోపణలను తిప్పికొడుతూ హైడ్రా కాంగ్రెస్ నాయకుడు పల్లంరాజు సోదరుడి నిర్మాణాలను మొదట కూల్చేసింది.. స్వపక్షమైనా, విపక్షమైనా.. నీటి వనరులను ఆక్రమిస్తే పడగొడతామని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను హైడ్రా నిజం చేసి చూపించింది.ఢిల్లీలోని ఎమరాల్డ్ ప్రాంతంలో ట్విన్ టవర్స్ నిర్మించారు. ఇది అక్రమం అని తేలడంతో 2012లో ఆ ప్రాంతవాసులు కోర్టును ఆశ్రయించారు. ఆ నిర్మాణాలు అక్రమమని 2014లో అలహాబాద్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. అయితే వీటిని కూల్చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో వీటిని నిర్మించిన సూపర్ టెక్ అనే కంపెనీకి ఎదురు దెబ్బ తగిలింది. ఈ ట్విన్ టవర్స్ ఢిల్లీలోని కుతుబ్ మినార్, ఇండియా గేట్ కంటే ఏడు మీటర్ల ఎత్తులో ఉండడంతో కూల్చేశారు. కేవలం ఏడు మీటర్ల ఎత్తులో ఉన్న భవనాలను కూల్చివేసినప్పుడు.. చెరువులను కబ్జా చేసి.. నిర్మించిన భవనాల విషయంలో ఎందుకు ఉదాసీన వైఖరి ప్రదర్శించాలని రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే అక్రమం అని తేలితే కూల్చి పడేస్తోంది.రాష్ట్రంలో హైడ్రా చేస్తున్న ఆపరేషన్లకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. సినీ హీరో నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ పడగొట్టినప్పుడు ప్రజల నుంచి విశేషమైన స్పందన వచ్చింది. అయితే దీనిని ఒక్క భారత రాష్ట్ర సమితి మాత్రమే వ్యతిరేకించింది. ఈ కూల్చివేతలకు వ్యతిరేకంగా పోరాడతానని నాగార్జున ప్రకటించినప్పటికీ.. ప్రజల నుంచి పెద్దగా మద్దతు లభించలేదు. మరోవైపు హైడ్రా నిర్వహిస్తున్న పనులకు ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. హైడ్రా పని తీరుకు హ్యాట్సాఫ్ చెబుతూ గండిపేట వెల్ఫేర్ సొసైటీ సపోర్ట్ వాక్ కూడా నిర్వహించింది. సపోర్ట్ వాక్ లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.హైడ్రా ఇప్పటివరకు 18 ప్రాంతాలలో చెరువుల పరిధిలో 43 ఎకరాల పరిధిలో స్ట్రక్చర్స్ ను నేలమట్టం చేసింది. గండిపేట చెరువు పరిధిలోనే 15 ఎకరాల్లో విస్తరించి ఉన్న నిర్మాణాలను తొలగించింది. కావేరి సీడ్స్ యజమాని భాస్కరరావు, మంథని బీజేపీ నాయకుడు సునీల్ రెడ్డి, బహదూర్ పూర ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మహమ్మద్ మీర్జా, నందగిరి హిల్స్ లో ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు, చింతల్ చెరువు లో భారత రాష్ట్ర సమితి నేత రత్నాకరం సాయిరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్లం రాజు సోదరుడికి చెందిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అంతేకాదు సీఎం సొంత సోదరుడు తిరుపతిరెడ్డి కూడా హైడ్రా నోటీసులు అందుకోవడం చర్చనీయాంశంగా మారింది.హిమాయత్ సాగర్ లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఫామ్ హౌస్ లు ఉన్నాయి.. వీటిని కూల్చే దమ్ము హైడ్రా కు ఉందా? అని భారత రాష్ట్ర సమితి నాయకులు సవాల్ చేస్తున్నారు. ఒకవేళ వీటిని పడగొడితే.. తెర వెనుక లోపాయి కారీ ఒప్పందం కుదిరి ఉంటుందనే ఆరోపణలు లేకపోలేదు. సీపీఐ నారాయణ అన్నట్టు పులి మీద స్వారీ చేస్తున్న రేవంత్ రెడ్డి.. మరి హైడ్రాను ఏ దిశగా పరుగులు తీయిస్తారనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

# దసరా, దీపావళీ స్పెషల్ ట్రైన్స్ రెడీ

**హైదరాబాద్ శుభ తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల ప్రజలు దసరా, దీపావళి పండుగలను ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా తెలంగాణలో ఈ పండుగకు ప్రతి కుటుంబ సభ్యుడు ఇంటికి రావాల్సిందే. అంతా కలిసి పండుగ చేసుకోవాల్సిందే అన్నట్టుగా ఉంటుంది. అందుకే దసరా, దీపావళి సమయాల్లో ఏ బస్సు చూసినా ఫుల్ ప్యాక్ అయి రాజధాని నగరం నుంచి జిల్లాలకు తరలుతుంటాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లలో సీట్ల కోసం పాట్లు మామూలుగా ఉండవు. రైలు మార్గాలు కూడా అంతే. టికెట్లు ఎప్పుడో బుక్ అయిపోయి ఉంటాయి. జనరల్ బోగీల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్లుతుంటారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే ఒక మంచి కబురు తెలిపింది. రైలు ప్రయాణం చేసే తెలుగు ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది.దసరా, దీపావళి, ఛత్ పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణిలకు ఆటంకాలు తొలగించాలనే ఆలోచనతో దక్షిణ మధ్య రైల్వే 48 ప్రత్యేక ట్రైన్లను నడుపనుంది. ఎస్‌సీఆర్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.



కాచిగూడ నుంచి తిరుపతి(07653) ట్రైన్ అక్టోబర్ 10 నుంచి నవంబర్ 11 వరకు సర్వీసులు అందిస్తుంది. ఈ ట్రైన్ కాచిగూడ వద్ద రాత్రి 10.30 గంటలకు బయల్దేరుతుంది. తర్వాతి రోజు ఉదయం 10.10 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. ఈ ట్రైన్ ఆరు గురువారాలు సర్వీస్ అందిస్తుంది. తిరుపతి నుంచి కాచిగూడ (07654) ట్రైన్ అక్టోబర్ 11 నుంచి నవంబర్ 15వ తేదీ (ప్రతి శుక్రవారం సేవలు) వరకు నడుస్తుంది. తిరుపతి స్టేషన్‌లో ఈ ట్రైన్ రాత్రి 8.05 గంటలకు డిపార్చర్ అవుతుంది. తర్వాతి రోజు రాత్రి 9.30 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి నాగర్సోల్ (07517) ఈ సర్వీసు అక్టోబర్ 9వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ (ప్రతి బుధవారం అందుబాటులో సికింద్రాబాద్ స్టేషన్‌లో అందుబాటులో ఉంటుంది.) వరకు ఉంటుంది. ఈ ట్రైన్ సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. నాగర్‌సోల్ నుంచి సికింద్రాబాద్ (07518) సర్వీస్ అక్టోబర్ 10 నుంచి నవంబర్ 7వ తేదీ (ప్రతి గురువారం) వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ట్రైన్ రాత్రి 10 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 10.50 గంటలకు చేరుకుంటుంది. కాకినాడ టౌన్ నుంచి సికింద్రాబాద్ (07122) ట్రైన్ అక్టోబర్ 7 నుంచి నవంబర్ 4వ తేదీ ( ప్రతి సోమవారం) వరకు సర్వీసులు అందిస్తుంది. సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్ (07188) సర్వీస్ అక్టోబర్ 8 నుంచి నవంబర్ 5వ తేదీ (ప్రతి మంగళవారం) వరకు అందుబాటులో ఉంటుంది. ఉదయం 8 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 6.45 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక ట్రైన్‌లలో ఫస్ట్ ఏసీ కమ్ 2ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ క్లాసు, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా ఉంటాయని ఎస్‌సీఆర్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.....

**శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్.**



**చేవెళ్ల శుభ తెలంగాణ:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఫతేపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి వాగును ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 7, 8 వార్డులలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించి ఇళ్లల్లో ఉన్నవారితో మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితులలోనే బయటికి రావాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చాకలి అశోక్, రాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్.**



**చేవెళ్ల శుభ తెలంగాణ :** శంకరపల్లి మునిసిపల్ భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని, స్థానిక మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవ్వరు వాటి దగ్గరకు వెళ్ళకూడదని సూచించారు. అదేవిధంగా కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకు వెళ్ళ వద్దన్నారు. దాటడానికి ప్రయత్నం చేయ వద్దని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయాలన్నారు. పాత ఇల్లలో నివసిస్తున్న వారు తక్షణమే ఇంటిని ఖాళీ చేసి సమీపంలోని ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో ఆశ్రయం పొందాను అన్నారు. పాత గోడల దగ్గరకు వెళ్ళవద్దని, విద్యుత్ స్తంభాలు, వైర్లను ముట్టుకో వద్దని తెలిపారు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఇంట్లోనే ఉండేలా చూడాలని అన్నారు. అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్లాలని తెలిపారు.తడిసిన కరెంటు స్థంబాలకు దూరంగా ఉండాలని,అదేవిధంగా మన గ్రామంలో గాని పట్టణంలో గాని తెరిచి ఉన్న డ్రైనేజీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టండి.**

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల శుభ తెలంగాణ :** రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవ్వరు వాటి పరిసరాల దగ్గరకు వెళ్ళకూడదని తెలిపారు. అదేవిధంగా చెరువులు పూర్తిగా నిండి అలుగులు పోస్తున్నందున ఎవ్వరు కూడా చెరువుల దగ్గరకు వెళ్ళ కూడదన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకు వెళ్ళవద్దు, దాటడానికి ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. పాత ఇల్లలో నివసిస్తున్న వారు తక్షణమే ఇంటిని విడిచి సమీపంలోని ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో ఆశ్రయం పొందాలన్నారు. పాత గోడల దగ్గరకు వెళ్ళ వద్దని, కరంటు స్తంభాలు, వైర్లను ముట్టుకో వద్దని వివరించారు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచాలని, రైతులు తమ పంట పొలాలలో, చేలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అందుబాటులో ఉండి సమస్యలు ఉన్న ప్రదేశాలను సందర్శించి ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.

## వాగులు, చెరువుల వద్ద పటిష్ట బందోబస్తు..



**వికారాబాద్ శుభ తెలంగాణ:** పోలీస్ అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్స్ ల పరిధిల్లో ఉన్న వాగులు, కుంటలు, చెరువులలో వరద నీటి ప్రవాహం పైన దృష్టి పెట్టాలని, రాబోయే రోజులలో మరింతగా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాగులు, చెవుల దగ్గర మరింత పటిష్టంగా బందోబస్త్ నిర్వహించాలని, ముందు జాగ్రత్త చర్యలను మరింతగా పటిష్టం చేయాలనీ, రాకపోకలు జరగకుండా పొంగిపొర్లుతున్న వాగులు,నాళాలు ల దగ్గర రోడ్డులను బ్లాక్ చేయాలనీ, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఇతర శాఖల అధికారులు మరియు గ్రామాల పెద్దలతో కలసి పని చేయాలనీ, బందోబస్త్ విధులలో పాల్గొనే సిబ్బంది, అధికారులు రెయిన్ కోట్ లను తప్పకుండా వినియోగించి తగు జాగ్రత్తలు పాటించాలాని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు.అనంతరం ఎస్పీ నారాయణ రెడ్డి జిల్లా ప్రజలకు సూచనలు చేయడం జరిగింది.ప్రజలు ఎవ్వరుకూడా నీటి ప్రవాహం వేగంగా వెళ్తున్నా వాగులను, కాలువలను, రోడ్డులను దాటకుండా సంయమనం పాటించాలని, ఎవరికైనా ఏదైనా అత్యవసరం ఉన్నట్లు అయితే పోలీస్ అధికారులకు గాని,డైల్ 100 కి గాని, పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 నెంబర్ కు గాని లేదా ఇతర శాఖల అధికారులకు గాని తెలియజేయాలని, పాతబడిన ఇండ్లలో ఎవ్వరుకూడా ఉండవద్దు, వర్షాకాలనికి సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని ప్రతిఒక్కరు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

## వర్షా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్...



**వికారాబాద్‌శుభ తెలంగాణ:** జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లింగ్యా నాయక్ వికారాబాద్ జిల్లా ధన్నారం కల్వర్టు, ధరూర్ మండలం నాగసముద్రం కల్వర్థుల ను పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యం లో వర్షా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలేవ్వరు కుడా చెరువుల దగ్గర కు వెళ్ళారాద ని, రానున్న రెండు రోజులు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అందరు అప్రమత్తం గా ఉండాలని, ఏదైనా అత్యవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారమీవ్వాలని మండల అధికారులకు ఆదేశించారు.. అదనపు కలెక్టర్ తో పాటు ఆర్ డి ఓ వాసు చంద్ర , ఏం ఆర్ ఓ, ఏం పి డి ఓ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# బ్రష్ చేయకపోతే ఎలాంటి సమస్యలు వస్తాయో తెలుసా?




ప్రతిరోజు మనం ఉదయం నిద్ర లేవగానే చేసే మొట్టమొదటి పని బ్రష్ చేయడం. ప్రతి ఒక్కరు కూడా ఉదయం లేచిన తర్వాత తప్పకుండా బ్రష్ చేయాలి. లేదంటే నోరు దుర్వాసన రావడంతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు కూడా వస్తాయి. అయితే నిజానికి రోజు బ్రష్ చేయడం అన్నది ఒక మంచి అలవాటు. ప్రతి ఒక్కరు కూడా ప్రతిరోజు బ్రష్ చేయాలి. కొందరు ఉదయం సాయంకాలం రెండు పూటలా బ్రష్ చేస్తూ ఉంటారు. ఇంకొందరు కేవలం ఒకసారి మాత్రమే బ్రష్ చేస్తుంటారు. ఇంకొంతమంది ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం వల్ల బ్రష్ చేయడమే మరిచిపోతూ ఉంటారు. ఇలా తరచుగా బ్రష్ చేయడం మానేస్తే అది అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. మన నోట్లో చాలా బ్యాక్టీరియా ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇది ఎక్కువగా హానికరం కాదు. రోజువారీ బ్రషింగ్ ప్రోటోకాల్ బ్యాక్టీరియా స్థాయిని సరైన స్థాయిలో ఉంచుతుంది. కానీ బ్రష్ సరిగ్గా చేయకపోతేనే ఈ బ్యాక్టీరియా స్థాయిలు పెరుగుతాయి. దీంతో దంత క్షయం, చిగుళ్ల వ్యాధులు వస్తాయి. నోటి ఆరోగ్యం మన జీర్ణ, శ్వాసనాళంతో దాని ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. మన నోట్లో అనారోగ్యకరమైన బ్యాక్టీరియా స్థాయిలు పెరగడం వల్ల అనేక గుండె జబ్బులు వస్తాయి. అలాగే ఉదర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. పళ్ళు శుభ్రం చేసుకోకపోతే ఏం నష్టం రాదు అని చాలామంది అంటూ ఉంటారు. కానీ అది ఆరోగ్యానికి అసలు మంచిది కాదని చెబుతున్నారు వైద్యులు. బ్రష్ చేయకపోతే టార్టార్ అని పిలువబడే గట్టి నిక్షేపాలుగా మారడానికి కేవలం 48 గంటలు పడుతుందట. పంటి ఉపరితలంపై టార్టార్ నిక్షేపాలు ఏర్పడిన తర్వాత వాటిని బ్రష్ తో తొలగించడం కష్టమవుతుంది. ఫలితంగా దంతాల ఉపరితలంపై ఎక్కువ నిక్షేపాలు పేరుకుపోతాయి. ఈ నిక్షేపాలు దంతాల నిర్మాణాన్ని బలహీనపరచడం ప్రారంభిస్తాయి. అలాగే నోట్లో నుంచి చెడు వాసన వస్తుంది. అలాగే అవి ఇతర చిగుళ్ల వ్యాధులకు కూడా కారణమవుతాయి. బ్రష్ చేయకపోతే పళ్ళపై పాచి పేరుకుపోయి పళ్ళు అందవిహీనంగా మారిపోయి నోటి దుర్వాసన ఎక్కువగా వస్తుంది. సలహా అనారోగ్యకరమైన నోరు శరీరంలో మంటకు దారితీస్తుంది. ఇది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. అలాగే ఇది మెదడు వాపు, మెదడు కణాల నష్టానికి దారితీస్తుంది. ఇది చిత్త వైకల్యానికి దారితీస్తుందని చెబుతున్నారు. నోరు శుభ్రం చేసుకోకపోతే జీర్ణ సంబంధించిన సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయట. కాబట్టి ప్రతిరోజు కనీసం రెండుసార్లు అయినా బ్రష్ చేసుకోవాలని చెబుతున్నారు. అలాగే తిన్న తర్వాత నోరు పుక్కలించడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. తీపి పదార్థాలు చిన్న ఆహారం తిన్న నోరు పుక్కిలించడం వల్ల పంటి మధ్య ఇరుక్కున్న చిన్నచిన్న ఆహార పదార్థాలు వెళ్లిపోతాయని చెబుతున్నారు. ఇలా చేయకపోతే నోట్లో బ్యాక్టీరియా పెరిగే పంటి సమస్యలు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి ప్రతి రోజు బ్రష్ చేయడం అన్నది తప్పనిసరి.

# వంకాయను అవాయిడ్ చేస్తున్నారా!



మన వంటింట్లో దొరికే కూరగాయలలో వంకాయ కూడా ఒకటి. కాగా మనలో చాలామంది వంకాయను తినడానికి అంతగా ఇష్టపడరు. ఇంకొందరు మాత్రం లొట్టలు వేసుకొని మరీ తినేస్తూ ఉంటారు. మార్కెట్ లో కూడా మనకు రకరకాల వంకాయలు లభిస్తూ ఉంటాయి. వంకాయ తింటే అలర్జీ వస్తుందని చాలామంది వంకాయ తినడానికి అంతగా ఇష్టపడరు. కానీ వంకాయ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే మాత్రం తినకుండా అసలు ఉండలేరు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మరి వంకాయ వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వంకాయలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా లభిస్తాయి. మీ ఆహారంలో వంకాయను చేర్చడం వల్ల మీ శరీరానికి సహజ రక్షణను అందుతుంది. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. ఇది వృద్ధాప్య రూపాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. వంకాయని తింటే యంగ్ గా కనిపిస్తారని కూడా చెబుతున్నారు. వంకాయలో ఫైబర్, పొటాషియం, విటమిన్ సి, బి విటమిన్లు మెండుగా ఉంటాయి. ఇవి మన గుండె ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతాయి. అలాగే ఇందులో ఉండే డైటరీ ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుందని చెబుతున్నారు. అలాగే పొటాషియం కంటెంట్ అధిక రక్తపోటును నియంత్రించడానికి సహాయపడుతుందట. ఇది గుండె పోటు ప్రమాదాన్ని తగ్గిస్తుందట. షుగర్ తో బాధపడుతున్న వారు వంకాయ తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయట. వంకాయను ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయని, ఇది జీవక్రియ సమతుల్యతను మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. అలాగే మొత్తం ఆరోగ్యానికి మద్దతునిస్తుంది. వంకాయలోని ఫైబర్ జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. దీనిలో ఉండే ఫైబర్ కంటెంట్ సాధారణంగా ప్రేగు కదలికలను ప్రేరేపిస్తుందట. అలాగు మలబద్ధకాన్ని నివారిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆహారంలో వంకాయను చేర్చుకోవడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడుతుందట. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా వంకాయను ఎటువంటి భయం లేకుండా తినవచ్చు అని చెబుతున్నారు.

# డయాబెటీస్‌తో బాధపడేవారికి గుడ్ న్యూస్.. ఈ మొక్క వాడితే ప్రయోజనాలే!



సరికాని ఆహారపు అలవాట్లు, దినచర్య కారణంగా మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దీని బాధితుల సంఖ్య కోట్లలో ఉంది. మనం భారతదేశం గురించి మాట్లాడినట్లయితే.. అత్యధిక సంఖ్యలో మధుమేహ బాధితులు ఉన్నారు. ఇది రక్తంలో చక్కెర ఎక్కువగా, తక్కువగా ఉండే వైద్య పరిస్థితి. ఇన్సులిన్ ఉత్పత్తి మందగిస్తుంది లేదా ఆగిపోతుంది. దీని కారణంగా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. దాని నిరంతర అధిక స్థాయి డయాబెటిక్ బాధితులను చేస్తుంది. దీని కారణంగా వ్యక్తి అనేక ఇతర అవయవాలు కూడా ప్రమాదానికి గురవుతాయి. మీరు కూడా డయాబెటీస్‌తో బాధపడుతూ కొన్ని హెూం రెమెడీ కోసం చూస్తున్నట్లయితే ఇన్సులిన్ ప్లాంట్ మీకు ఔషధంగా పనిచేస్తుంది. దీని ఆకులు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. టైప్ 2 డయాబెటిస్ రోగులు దీనిని తీసుకోవచ్చు. ఈ ఇన్సులిన్ మొక్క ఆకులను తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. నిజానికి ఇన్సులిన్ మొక్క ఒక ఔషధ మొక్క. ఇది ఔషధాల తయారీలో కూడా ఉపయోగించబడుతుంది. ఈ మొక్క ఆకులు అనేక లక్షణాలను కలిగి ఉంటాయి. మీరు టైప్ టూ డయాబెటీస్ పేషెంట్ అయితే, షుగర్ లెవెల్ ఎక్కువగా ఉంటే మీరు ఇన్సులిన్ ఆకులను తీసుకోవచ్చు. ఉదయం నిద్రలేచిన వెంటనే దీని ఆకులను నమలడం వల్ల షుగర్ అదుపులో ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను కరిగిస్తుంది. దాని అదనపు పరిమాణాన్ని గ్రహిస్తుంది. ఈ మొక్క శాస్త్రీయ నామం కాక్టస్ పిక్టస్. ఈ క్రేప్‌ను అద్రాక్, కెముక్, క్యూ, కీకండ్, కుముల్, పక్రముల, పుష్కరముల వంటి పేర్లతో కూడా పిలుస్తారు. ఇన్సులిన్ మొక్క ఆకులు పుల్లని రుచిని కలిగి ఉంటాయి. హాయిగా తినొచ్చు. మధుమేహ రోగులకు ఇది ఔషధం కంటే తక్కువ కాదు. మీరు వాటిని ఉదయం నీటితో కూడా తీసుకోవచ్చు. దీని కోసం మొక్క రెండు ఆకులను కడగాలి. ఇప్పుడు దీన్ని ఒక గ్లాసు నీటిలో కరిగించి ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా త్రాగాలి. దీని రెగ్యులర్ వినియోగం రక్తంలో చక్కెర పెరగడానికి అనుమతించదు. ఇన్సులిన్ ప్లాంట్‌లో డజనుకు పైగా పోషకాలు ఉంటాయి. ప్రొటీన్లు, ఫ్లేవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఆస్కార్బిక్ యాసిడ్, బీటా కెరోటిన్, కార్బోలిక్ యాసిడ్, టెర్పెనాయిడ్లు దీని ఆకుల్లో పుష్కలంగా లభిస్తాయి. వాటి వినియోగం రక్తంలో చక్కెరను నియంత్రించడమే కాదు. ఇది రక్తపోటును కూడా నియంత్రిస్తుంది. ఇది ప్రేగులు, గుండె, కళ్ళు కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది కొలెస్ట్రాల్‌కు ఔషధంగా కూడా పనిచేస్తుంది.

# పొడి దగ్గుతో ఇబ్బంది పడుతున్నారా!



మామూలుగా చాలా మందికి సీజన్ తో సంబంధం లేకుండా పొడి దగ్గు సమస్య ఇబ్బంది పెడుతూ ఉంటుంది. పొడి దగ్గు కేవలం చలికాలంలో మాత్రమే మనకు ఎక్కువగా వస్తూ ఉంటుంది.కానీ కొంతమందికి మాత్రం సీజన్ తో సంబంధం లేకుండా ఈ పొడి దగ్గు సమస్య ఇబ్బంది పెడుతుంటుంది. ఈ పొడి దగ్గు కారణంగా సరిగ్గా నిద్ర పట్టక గొంతు మొత్తం ఇన్ఫెక్షన్ అయ్యి చాలా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. అయితే ఈ పొడి తగ్గించుకోవడం కోసం రకరకాల మెడిసిన్స్ ని యూజ్ చేస్తూ ఉంటారు. ఇంకొందరు హెూమ్ రెమెడీస్ ని కూడా ఫాలో అవుతూ ఉంటారు. మీరు కూడా సింపుల్ చిట్కాలను ఉపయోగించి ఈ పొడి దగ్గు సమస్యకు చెక్ పెట్టండి. అందుకోసం ఏం చేయాలి అన్న విషయాన్ని వస్తే.. పొడి దగ్గును నయం చేయడానికి, పసుపు పాలు బాగా పనిచేస్తాయి. మరుగుతున్న పాలలో పసుపు పొడి, ఎండుమిర్చి, అల్లం తేనె కలపాలి. పొడి దగ్గును నయం చేయడానికి దీనిని గోరు వెచ్చని వేడిగా త్రాగడం మంచిది. ఈ పదార్థాల వార్మింగ్ లక్షణాలు పొడి దగ్గు వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే, పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇది నొప్పి నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. తేనెను జోడించడం వల్ల తీపి, గొంతు ఉపశమన ప్రయోజనాలు కలిగిస్తాయి. మరొక రెమిడి విషయానికొస్తే.. ఒక పాత్రలో నీటిని తీసుకుని, నిమ్మరసం,పుదీనా వేసి, ఈ మిశ్రమాన్ని మరిగించి బాగా వడకట్టాలి. తర్వాత తేనె వేసి బాగా కలపాలి. ఈ నీటిని తాగడం వల్ల గొంతులో మంటను తగ్గించడంతో పాటు నొప్పిని తగ్గిస్తుంది. నిమ్మ, లికోరైస్, నిమ్మ,తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు నొప్పిని తగ్గించి, నయం చేస్తాయని చెబుతున్నారు. అదేవిధంగా అల్లం నీరు కూడా గొంతు నొప్పిని, పొడి దగ్గుని తగ్గించడంలో ఎంతో బాగా ఉపయోగపడుతుందట. ఇందుకోసం అల్లం తులసి ఆకులను బాగా మరిగించి అందులో తేనె కలిపి గోరువెచ్చగా ఉన్నప్పుడే తాగాలని చెబుతున్నారు. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ , యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది గొంతు నొప్పిని నయం చేయడానికి , గొంతు చికాకును తగ్గించడానికి సహాయపడుతుందట.

# వినాయక చవితి రోజున పొరపాటున కూడా ఈ తప్పులు చేయవద్దు ..



శ్రావణం మాసం ముగిసి త్వరలో భాద్రపద మాసంలో అడుగు పెట్టనున్నాం. దీంతో వినాయక చవితి సందడి మొదలైంది. పిల్లలు పెద్దలు ఇష్టంగా జరుపుకునే వినాయక చవితి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విఘ్నాలకధిపతి వినాయకుడు పుట్టినరోజును దేశంలోని ఢిల్లీ నుంచి గల్లీ వరకూ జరుపుకుంటారు. హిందూ మతం ప్రకారం గజాననుడు జ్ఞానానికి అధినేత. భక్తి శ్రద్ధలతో పూజించినప్పుడు గణేషుడు చాలా సంతోషిస్తాడు. భక్తుని పూజకు సంతసించి పార్వతి పుత్రుడు వరాలను కురిపిస్తాడని విశ్వాసం. శివుడిలాగే వినాయకుడు కూడా చిన్న చిన్న పరిహారలతోనే సంతృప్తి చెందుతాడు. అయితే వినాయకుడిని పూజించే సముయంలో కొన్ని పనులు చేయడం మరచిపోతే కోపం వస్తుంది. పూజ ఫలం లభించదు. మరోవైపు గణేశుడి వాహనం ఎలుక ఇంద్రియాలకు చిహ్నం. హిందూ మతంలో ప్రధాన దేవతలలో ఒకడు గణపతి. అయితే వినాయకుడిని పూజించేటప్పుడు తెలిసి తెలియక కూడా కొన్ని తప్పులు చేయవద్దు. ఈ పొరపాట్లు చేస్తే వినాయకుడికి ఆగ్రహం వస్తుంది. కష్టాలు ఎదుర్కోవాల్సి కూడా వస్తుందని పురాణాల కథనం. కనుక ఏ పొరపాట్లు చేయవద్దో ఈ రోజు తెలుసుకుందాం.. తులసి దళాలు: పురాణాల ప్రకారం దేవాదిదేవ మహాదేవుడు పార్వతి దేవిల తనయుడు గణేశుని పూజలో తులసి దళాలను పొరపాటున కూడా ఉపయోగించవద్దు. పూజలో తులసి ఆకులను ఉపయోగించవద్దని గణేశుడు ఒకసారి తులసిని శపించాడని చెబుతారు. కనుక గణపతి పూజలో పొరపాటున కూడా తులసి దళాలను ఉపయోగించవద్దు. అయితే వినాయకుడి పూజలో దుర్బా గడ్డిని ఉపయోగించడం శ్రేయస్కరం. చంద్రుడు: గణేశుడికి.. చంద్రునికి మధ్య సఖ్యత లేదు. శివుడి శిగలో ఉన్న చంద్రుడు ఒకసారి వినాయకుడి గజరూపాన్ని వెక్కిరించాడని చెబుతారు. అందుకే ఆ సమయంలో గణేశుడు చంద్రుడిని చూసిన వారు కష్టాలు పడతారని.. నీలప నిందలకు గురవుతారని శపించాడు.

వెండి వస్తువులు: వినాయక చవితి రోజున మాత్రమే కాదు గణేశ పూజలో వెండి పాత్రలు, తెల్లటి వస్తువులను ఎప్పుడూ ఉపయోగించకూడదు. తెల్ల గంధానికి బదులుగా పసుపు చందనం, పసుపు వస్త్రం, తెల్లని వస్త్రానికి బదులుగా పసుపు పూసిన దారం ఉపయోగించండి. అంతేకాదు వినాయక చవితి రోజున చంద్రుని దర్శనం శాస్త్రాలలో నిషిద్ధం. పగిలిన బియ్యం:సనాతన ధర్మం ప్రకారం వినాయకుని పూజలో పొరపాటున కూడా విరిగిన బియ్యాన్ని సమర్పించవద్దు. బదులుగా, మొత్తం బియ్యం ఉపయోగించండి. అయితే అక్షతలుగా ఉపయోగించే బియ్యంలో ముక్కలు ఉండవద్దు. అంతేకాదు వినాయకుని పూజలో పొడి బియ్యాన్ని ఉపయోగించవద్దు. మొగలి పువ్వులు: శివుడు వలెనే గణేశుడి పూజలో కూడా మొగలి పువ్వులు వాడటం నిషిద్ధం. శివుడు మొగలి పువ్వుని శపించాడు. కనుక ఈ దేశీయ పుష్పం అతని కుమారుడైన వినాయకుడికి కూడా సమర్పించరాదు. ఎండిన పువ్వులు: వినాయకుని పూజలో పొరపాటున ఎండిన లేదా వాడిన పువ్వులను సమర్పించవద్దు. పూజ సమయంలో తాజా పువ్వులు అందుబాటులో లేకపోతే పువ్వులను అస్సలు సమర్పించవద్దు. దుర్బను లేదా అక్షతలను సమర్పించినా చాలు. అంతేకాదు ఎండిపోయిన లేదా వాడిపోయిన పువ్వులతో పూజ చేయడం తప్పు. వినాయకుడికి కోపం వస్తుంది. వాస్తు దోషంతో పాటు ఇంట్లో ఆనందం, శాంతి లోపిస్తుంది. ప్రతికూల శక్తి కూడా పెరుగుతుంది.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110